క్లుప్తంగా

పోలీస్ స్పందనలో 71 ఫిర్యాదులు



విజయవాడ స్పోర్ట్స్: జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా స్పందన కార్యక్రమంలో డీసీపీ విశాల్‌గున్నీ 71 మంది బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. నగదు లావాదేవీలపై 16, కుటుంబ కలహాలపై 16, ఆస్తి వివాదాలపై 12, మోసాలకు సంబంధించి తొమ్మిది, ఇతర సమస్యలపై 18 ఫిర్యాదులను బాధితులు అందజేశారు. నిర్ణీత కాల వ్యవధిలో ఫిర్యాదులను పరిష్కరించాలని అధికారులకు డీసీపీ ఆదేశాలిచ్చారు.

రక్తదానంపై అవగాహన పెంచుకోవాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రక్తదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కాకరపర్తి భావనారాయణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు అన్నారు. ఆ కళాశాల జువాలజీ, జాతీయ సేవా పథకం, రెడ్‌రిబ్బన్ క్లబ్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో కళాశాలలోని డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు బ్లడ్ గ్రూపింగ్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ప్రారంభించిన డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ రక్తదానం తోటి మానవుల ప్రాణాలను నిలబెడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ రక్తాన్ని అందించి తోటివారి ప్రాణాలను కాపాడాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, ఐక్యూఏసీ కన్వీనర్ డాక్టర్ జి.కృష్ణవేణి, జువాలజీ, బోటనీ విభాగాల అధిపతులు ఎం.సాహితీ, ఎస్కే అలీబాషా, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు వి.శేషగిరిరావు, డి.పవన్‌కుమార్, ఎన్.సాంబశివరావు, అధ్యాపకులు డాక్టర్ శకుంతల, విద్యార్థులు పాల్గొన్నారు.

మధుర స్వరాల శాల ఘంటసాల

విజయవాడకల్చరల్: మధుర స్వరాల శాల ఘంటసాల అని జీఆర్‌కే సాహితీపీఠం వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు అన్నారు. సాంస్కృతిక కళా సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్ కొతా పూర్ణానందం కళావేదిక మీద సోమవారం ఘంటసాల 101 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నారాయణరావు మాట్లాడుతూ ఘంటసాల స్వరం భగవంతుడు తెలుగు వారికి ఇచ్చిన గొప్ప వరమని అన్నారు. శ్రీ కళాభారతి అధ్యక్షుడు శింగంశెట్టి పెద బ్రహ్మం మాట్లాడుతూ ఏటా ఘంటసాల పేరుతో పురస్కారాలను ప్రదానం చేస్తునట్లు తెలిపారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్ రాజు, పాత్రికేయుడు కొల్లూరి వెంకట్, సయ్యద్ అలీ, గాయకుడు మంగరాజు పాల్గొన్నారు. ఘంటసాల పాటలను ఆలపించారు. దుర్గాపురంలోని ఘంటసాల సంగీత కళాశాలలో ఘంటసాల సంగీత విభావరి నిర్వహించారు. సుధా శ్రీనివాస్, గుడిపాటి హరికృష్ణ ఘంటసాల పాటలను ఆలపించారు.

'మిచాంగ్'తో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- చిన్నారులను ఇంటి వద్దనే ఉంచండి
- మిచాంగ్ తుఫాన్ దృష్ట్యా ముందస్తు జాగ్రత్త చర్యలు
- వీఎంసీలో స్పెషల్ సెల్ ఏర్పాటు



కొండ ప్రాంత వాసులకు నోటీసు అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

పటమట(విజయవాడతూర్పు): మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. సోమవారం ఉదయం విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో మిచాంగ్ తుఫాన్‌కు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలోని ప్రజలందరికీ మిచాంగ్ తుఫాన్ గురించి అప్రమత్తం చేయాలని, చిన్నారులను ఇంటి వద్దనే ఉంచాలన్నారు. తుఫాన్ సూచనలు ఉన్నందున తీవ్ర గాలులు వర్షాలు పడే అవకాశాలు ఉంటాయని చెప్పారు. అవుట్‌ఫాల్ డ్రెయిన్ల వద్ద చిన్నారులను పంపించకూడదని సూచించారు. తుఫాన్ కారణంగా నగర వాసులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే ప్రజలు తాగునీటిని కాచి చల్లార్చి, వడపోసి తాగాలని సూచించారు.

పునరావసం ఏర్పాటు

డీ – వాటరింగ్ కోసం పంప్స్, ఔట్ ఫాల్ డ్రెయిన్స్ క్లీనింగ్‌కు జేసీబీలు అన్ని చోట్ల ముందుగానే సిద్ధంగా ఉంచాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. విద్యుత్ సమస్య వచ్చినా ప్రజలకు తాగునీటి సరఫరాకు ఎలాంటి సమస్య తలెత్తకుండా అన్ని చోట్ల ఓవర్‌హెడ్ ట్యాంకుల్లు ముందుగానే నింపాలని సూచించారు. తుఫాన్ ప్రభావంతో నగరంలో తీవ్ర గాలుల వీస్తున్నందున బ్యానర్లు, హోర్డింగ్లు పడిపోయే అవకాశాలు ఉంటాయని, తగిన చర్యలు తీసుకోవాలన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో కొత్త బ్యానర్లు, హోర్డింగ్లు ఏర్పాటు చేసుకునేందుకు వీలులేదని, ప్రస్తుతం ఉన్న బ్యానర్లు, హోర్డింగ్లు ప్రమాదవశాత్తు ఏవి ఉన్నాయో గుర్తించి పలు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. కొండ ప్రాంతాల్లో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, కొండ రాళ్లు పడే అవకాశమున్న ప్రాంతాలు ముందుగానే ఖాళీ చేయాలని చెప్పారు. తుఫాన్ తీవ్రత తగ్గిన తర్వాత ప్రజలు మళ్లీ తమ ఇళ్లకు రావొచ్చని అప్పటి వరకు ఆ ఏరియాల్లో ఉన్న స్కూళ్లలో వాళ్లకు పునరావసం కల్పిస్తున్నామన్నారు. ఏ ప్రాంతంలో ఏ స్కూల్‌కు వెళ్లాలి అన్న విషయం, వలంటీర్ లేదా వీఆర్వో ద్వారా తెలుసుకోవచ్చని చెప్పారు. నగర పరిధిలోని అవుట్‌ఫాల్ డ్రెయిన్లు మొత్తం మూసే అవకాశం లేనందున అందులో ఎక్కువగా చెత్త పేరుకుపోయినందున జేసీబీలతో వాటిని తొలగిస్తున్నామన్నారు. ఈ క్రమంలో అవుట్‌ఫాల్ డ్రెయిన్లు మొత్తం మూసేయ్యటానికి అవకాశం లేదని చెప్పారు. అవుట్ ఫాల్ డ్రెయిన్ల వద్ద నివసించే వారంతా వారి ఇళ్లలోని చిన్నారులను బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

స్పెషల్ సెల్ ఏర్పాటు

వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో వీఎంసీ ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామని కమిషనర్ చెప్పారు. నగర వాసుల సమస్యలను పరిష్కరించేందుకు 0866–2422515, టోల్ ఫ్రీ నంబర్ 18004252000, వాట్సాప్ నంబర్ 8181960909 ద్వారా ప్రజలు తమ సమస్యలను వీఎంసీ దృష్టికి తీసుకురావచ్చన్నారు. సంబంధిత సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. స్పెషల్ సెల్‌లో నగరవాసులకు అందుబాటులో ఉండేలా 24 గంటలు మూడు షిఫ్టుల్లో సిబ్బందిని నియమించామని, ప్రజలకు ఎటువంటి సమస్య కలిగిన వెంటనే పైన తెలిపిన నెంబర్లకు ఫోను చేసి తమ సమస్యలను తెలపాలని కమిషనర్ కోరారు. కాల్వల నుంచి పూడిక, రోడ్లపై నీరు నిల్వ, నీటి పైపులు లీకులు, రిపేర్లు, కాల్వలకు మరమ్మతులు, సీజనల్ వ్యాధులు, చెట్టు విరిగిపడటం తదితర సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని చెప్పారు.

ముమ్మరంగా సిల్టు తొలగింపు పనులు



వ్యర్థాల తొలగింపును పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): తుఫాన్ తీవ్రత కారణంగా కాల్వలు, అవుట్‌ఫాల్ డ్రెయిన్లలో మురుగునీరు సక్రమంగా పారాలంటే పూడికతీత పనులు శరవేగంగా జరగాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మిల్క్ ప్రాజెక్ట్, గుణదల, గుంట తిప్ప దగ్గర ఉన్న అవుట్ ఫాల్ డ్రెయిన్లలో జరుగుతున్న పూడిక తీత పనులను సోమవారం ఆయన పరిశీలించారు. మిచాంగ్ తుఫాన్ కారణంగా నగరంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డ్రెయిన్లు పొంగి పొర్లకుండా అందులో పేరుకుపోయిన చెత్తను జేసీబీలతో తొలగిస్తున్న పనితీరును ఆయన పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలకు ముందస్తు సమాచారం అందించి వారిని స్థానికంగా ఉన్న పాఠశాలల్లో పునరావాసం కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో కమిషనర్ వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణమూర్తి, జోనల్ కమిషనర్ డాక్టర్ రవిచంద్ తదితరులు పాల్గొన్నారు.

వీఎంసీ స్పందనకు 10 అర్జీలు



స్పందనలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో 10 ఫిర్యాదులు అందాయని విజయవాడ నగరపాలకసంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. స్పందనలో టౌన్ ప్లానింగ్ విభాగం – 4, హెల్త్ విభాగం – 3, ఎస్టేట్ విభాగం – 2, పట్టణ సాధికార విభాగం ప్రాజెక్ట్ అధికారి(యూసీడీ) – ఒక ఫిర్యాదు అందిందన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి అందుకున్న ఈ ఫిర్యాదులకు సత్వర పరిష్కారాలు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కె.వి.సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, చీఫ్ ఇంజినీర్ ప్రభాకర్‌రావు, సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, డెప్యూటీ కమీషనర్(రెవెన్యూ) వెంకటలక్ష్మి, ఏడీహెచ్ శ్రీనివాస్, ఏఓ నరసింహమూర్తి, ఆర్ఎఫ్ఓ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

మాజీ సీఎం రోశయ్య సేవలు అపూర్వం



రోశయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు వెలంపల్లి, విష్ణు, మేయర్ భాగ్యలక్ష్మి, నాయకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మాజీ ముఖ్యమంత్రి కొనిజేటి రోశయ్య దేశానికి అందించిన సేవలు అపూర్వమని పలువురు ప్రముఖులు కొనియాడారు. విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కొనిజేటి రోశయ్య రెండో వర్ధంతిని నగరపాలకసంస్థ సమీపంలోని రోశయ్య విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు రోశయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీని నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ.. రోశయ్య ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, మంత్రిగా, ముఖ్యమంత్రిగా, పీసీసీ అధ్యక్షునిగా, గవర్నర్‌గా వివిధ హోదాల్లో దేశాభ్యున్నతికి సేవలందించారని కొనియాడారు.

మల్లాది విష్ణు మాట్లాడుతూ.. రోశయ్య జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కొనిజేటి రోశయ్య నిర్వహించిన పదవులకు వన్నె తెచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు, ఆర్యవైశ్య సంఘం అర్బన్ అధ్యక్షుడు పల్లపోతు మురళీకృష్ణ, కార్పొరేటర్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి జగనే మళ్లీ సీఎం కావాలి

- ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు
- ఉత్సాహంగా 'వై ఏపీ నీడ్స్ జగన్'



46వ డివిజన్‌లో పార్టీ జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రజలు మళ్లీ జగనే సీఎం కావాలని కోరుకుంటున్నారని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. భవానీపురం 40వ డివిజన్ పరిధిలోని 123వ సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం సోమవారం జరిగింది. నాలుగున్నరేళ్లలో సచివాలయ పరిధిలో జరిగిన అభివృద్ధి సంక్షేమానికి సంబంధించిన వివరాలతో కూడిన డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించారు. అంతకు ముందు పార్టీ జెండా దిమ్మెను ఆవిష్కరించారు. కార్యక్రమంపై డివిజన్‌లోని పెద్దలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ.. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో 40వ డివిజన్ కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డి, నాయకులు గౌస్ మొహిద్దీన్, యశోధర్, కేసరి కృష్ణారెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గతంలో ఎన్నడూ లేని రీతిలో అభివృద్ధి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించిన ఘనత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. 46వ డివిజన్‌లోని 142వ సచివాలయం పరిధిలో సోమవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వెలంపల్లి, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మిలు హాజరయ్యారు. సచివాలయం ఎదుట ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాల బోర్డును వారు ఆవిష్కరించారు. అనంతరం సచివాలయం పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, వైఎస్సార్ సీపీ నగర ప్రధాన కార్యదర్శి రాయన నరేంద్ర, ట్రాక్టర్ రాము, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



40వ డివిజన్‌లో డిస్ ప్లే బోర్డు ఆవిష్కరించిన ఎమ్మెల్యే వెలంపల్లి, కార్పొరేటర్ ఆంజనేయరెడ్డి

ఎన్నికల హామీలను నెరవేర్చిన ఘనత జగన్‌దే

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలన్నింటిని అమలు చేసి మాట నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. కొత్తపేట 51వ డివిజన్‌లో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా 164వ సచివాలయంతో సభను నిర్వహించారు. స్థానిక ప్రజానీకంతో ఎమ్మెల్యే వెలంపల్లి ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే వారికి అందిన పథకాలపై ఆరా తీశారు. అదేవిధంగా సచివాలయం పరిధిలో స్థానిక ప్రజలకు జరిగిన మేలుకు సంబంధించిన వివరాలను తెలియజేసే బోర్డును కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్‌మోడల్‌గా నిలుస్తున్నాయన్నారు. విద్యా, వైద్య రంగాలకు సంబంధించిన అభివృద్ధి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అండగా నిలుస్తున్నాయని వివరించారు. రానున్న కాలంలో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డికి ముఖ్యమంత్రి పదవిని అందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కొఠారి తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో పోలీస్ అధికారుల పర్యటన



చిల్లకల్లు నదీ తీరంలో అధికారులకు సూచనలిస్తున్న డీసీపీ అజిత



కొండ ప్రాంతాల్లో పర్యటిస్తున్న డీసీపీ సత్తిబాబు, ఏసీపీ హనుమంతరావు, సీఐ సుబ్రహ్మణ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో కొండ ప్రాంతాల్లో ఎటువంటి నష్టం వాటిల్లకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని డీసీపీ మోకా సత్తిబాబు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నగర పోలీస్ కమిషనర్ టి.కె.రాణా ఆదేశాల మేరకు డీసీపీ మోకా సత్తిబాబు, వెస్ట్ ఏసీపీ హనుమంతరావు, కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యం కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కొండ ప్రాంతాల్లో సోమవారం పర్యటించారు. తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అదే విధంగా కొండ రాళ్లు జారి పడే ప్రమాదం ఉన్న ప్రాంతవాసులు ముందస్తుగా పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని సూచించారు. గతంలో ప్రమాదాలు చోటు చేసుకున్న ప్రాంతాలతో పాటు కొండ శివారు ప్రాంతాల్లో నివాసం ఉన్న వారి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం చిట్టినగర్ సొరంగం, గొల్లపాలెంగట్టు, వించిపేట, నైజాంగేటు కొండ ప్రాంతాల్లోనూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మైక్ ద్వారా ప్రచారం చేయించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విజయవాడస్పోర్ట్స్: మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను డీసీపీ వి.అజిత అప్రమత్తం చేశారు. ఎన్టీఆర్ జిల్లాలోని కృష్ణా నదీ తీరాన ఉన్న నందిగామ, జగ్గయ్యపేట పోలీస్ సర్కిల్ పరిధిలోని ప్రాంతాల్లో సోమవారం ఆమె పర్యటించారు. మిచాంగ్ తుఫాన్ నెల్లూరు–మచిలీపట్నం ప్రాంతాల్లో తీరం దాటవచ్చని వాతావరణ శాఖ సూచిస్తున్నట్లు ప్రజలకు వివరించారు. తీరం దాటే సమయంలో వర్షం అత్యధికంగా కురిసే అవకాశాలున్నాయన్నారు. అధిక నీటి ప్రవాహం ఉండే రోడ్డులు, నదులు, వాగులతో పాటు బ్రిడ్జిలు దాటేందుకు ఎవరూ సాహించవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లోనే సురక్షితంగా ఉండాలని సూచించారు.

కృష్ణానది వైపు వెళ్లవద్దని కోరారు. బలమైన గాలులు వీచే అవకాశం ఉన్న నేపథ్యంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంబాలు, చెట్లు, బలహీనంగా ఉన్న ఇంటి గోడలు వద్ద ఉండొద్దని సూచించారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో ఉండే ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. తుఫాను బాధితుల సహాయార్థం పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. తుఫాన్ కారణంగా ఇబ్బందుల్లో ఉన్న వారు ఎవరైనా 0866–2491001ను సంప్రదించి సహాయం పొందవచ్చన్నారు. నదీ తీరంలోని అన్ని మండలాల్లోనూ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు. డీసీపీ వెంట క్రైమ్ ఏడీసీపీ వెంకటరత్నం, ఏసీపీ జనార్దననాయుడు, సీఐలు జె.ఆర్.కె.హనీష్‌బాబు, ఎం.జానకీరామ్, ఐ.వి.నాగేంద్రకుమార్, అగ్నిమాపక సిబ్బంది, పలు శాఖల అధికారులు ఉన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజంలో ప్రతి ఒక్కరూ అట్టడుగు వర్గాలకు అండగా ఉండాలని రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ అధ్యక్షుడు బాయన బాబూజీ(బాబ్జీ) అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమాన్ని పాతబస్తీలోని రామాలయం ఆవరణలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 30 పేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులను రోటరీ ప్రముఖులు, స్థానిక పెద్దల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా బాబూజీ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా రోటరీ సంస్థలు వివిధ రంగాలకు సంబంధించిన విస్తృతమైన సేవలందిస్తున్నాయన్నారు. ప్రధానంగా వైద్య రంగానికి సంబంధించి అద్భుతమైన సేవలను రోటరీ సంస్థలు కొనసాగిస్తున్నాయని పేర్కొన్నారు. అదే క్రమంలో తమ రోటరీ విజయవాడ ఈస్ట్ విభాగం ఆధ్వర్యంలో ప్రతి నెల పేదలకు నిత్యావసర వస్తువుల పంపిణీని నిర్వహిస్తున్నామన్నారు. సభ్యుల సహకారంతో సేవలను కొనసాగిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి గుండారపు శ్రీనివాసరావు, కోశాధికారి గణేష్ సుబ్బారావు, అసిస్టెంట్ గవర్నర్ పిళ్లా మోహనరావు, ఉపాధ్యక్షుడు అమానుల్లా, శ్రీశైలం దేవస్థానం కమిటీ సభ్యులు గురుమహంతు మహేష్ పాల్గొన్నారు.

శివాలయాలకు పోటెత్తిన భక్తులు



పాతశివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పవిత్రమైన కార్తిక సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకొని వన్‌టౌన్‌లోని పలు శివాలయాలకు భక్తులు పోటెత్తారు. పరమశివుడిని తలచుకుంటూ భక్తులు చేసిన హరనామస్మరణతో ఆలయాలు మారుమోగాయి. తెల్లవారుజాము నుంచి శివాలయాలన్నింటిలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, లింగార్చన తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రధానంగా ఆయా ఆలయాల్లో భక్తులు తెల్లవారుజాము నుంచి క్యూలైన్లలో బారులు తీరి కనిపించారు.

పాతశివాలయంలో....

వన్‌టౌన్ శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో భక్తుల తెల్లవారుజాము మూడు గంటల నుంచి పోటెత్తారు. ఆలయంలో జరుగుతున్న కార్తికమాస నక్త దీక్షా మహోత్సవాలను పురస్కరించుకొని స్వామి వారికి రుద్రాభిషేకం, బిల్వార్చన, దశశాంతులు, సహస్రనామార్చనలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అదేవిధంగా సాయంత్రం భక్తులు భారీగా ఆలయానికి తరలివచ్చారు. కార్తిక దీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ అధికారులు పర్యవేక్షించారు. కొత్తపేటలోని శ్రీ గంగా పార్వతీ సమేత ధర్మేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకుడు మురళీ ఆధ్వర్యంలో స్వామి వారికి రుద్రాభిషేకాలను, విశేష పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పాతబస్తీలోని శ్రీ కన్యకా నగరేశ్వర, కోదండ రామాలయం(కొత్తగుళ్లు) ఆవరణలో కొలువై ఉన్న శ్రీ నగరేశ్వరస్వామి వారి దేవస్థానంలో విశేష పూజలు నిర్వహించారు. రుద్ర హోమంతో పాటుగా సహస్ర లింగార్చన తదితర ప్రత్యేక వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ గంగానమ్మ అమ్మవారి దేవస్థానంలో సహస్రనామార్చన, ప్రత్యేక అభిషేకాధి కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తీకదీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు. రామ్‌గోపాల్ సత్రం ప్రాంగణంలో కొలువై ఉన్న కాశీ విశ్వేశ్వరస్వామి వారి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక అర్చనలను నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలను నిర్వహించారు.



అర్ధనారీశ్వరునికి పంచామృత అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకుడు



కొత్త అమ్మవారి గుడిలో స్వామి వారికి అభిషేకాలు

మల్లేశ్వరస్వామికి పంచామృత అభిషేకాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని స్వామి వారికి భక్తులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు నిర్వహించేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయంలో బారులు తీరారు. భీమన వారి పేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామి వారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్‌కుమార్ శర్మలు పూజా కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం రామలింగేశ్వర స్వామి వారికి విశేష అలంకరించారు. ఇంద్రకీలాద్రిపై కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని స్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సహస్ర లింగార్చనలో పెద్ద సంఖ్యలో ఉభయ దాతలు పాల్గొన్నారు. సాయంత్రం ఊంజల్ సేవ, దీపార్చన సేవలు నిర్వహించారు.